పాలమూరు యూనివర్సిటీ లైబ్రరీ భవనంలో ఈవీఎంలను భద్రపరిచిన అధికారులు

కట్టుదిట్టంగా ఈవీఎంల భద్రత

కొడంగల్, మే 14: పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ ప్రక్రియలో ఉపయోగించిన ఈవీఎంలను మంగళవారం అధికారులు మహబూబ్‌నగర్‌లోని పాలమూరు యూనివర్సిటీ, లైబ్రరీ భవనంలో భద్రపరిచారు. ఈ సందర్భంగా అధికారులు కలెక్టర్, రిటర్నింగ్ అధికారి రవి నాయక్, జనరల్ అబ్జర్వర్ త్సెవాంగ్ గౌచో భూటియా, జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నడుమ స్ట్రాంగ్ రూంకు సీల్ వేసి ఈవీఎంలను భద్రపరచడం జరిగిందని తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు. కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ఉదయం వాహనంలో ఈవీఎంలను పాలమూరు యూనిర్సిటీలోని లైబ్రరీ భవన స్ట్రాంగ్ రూంకు తరలించినట్లు పేర్కొన్నారు.

'అమ్మ చెక్కిన శిల్పం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వక్తలు

'అమ్మ చెక్కిన శిల్పం' పుస్తకావిష్కరణ

రవీంద్రభారతి, మే 14: తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, పాలపిట్ట బుక్స్ ఆధ్వర్యంలో మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని జాలాది రత్న సుధీర్ రచించిన 'అమ్మ చెక్కిన శిల్పం' హిందీ అనువాద పుస్తకావిష్కరణ సభ మంగళవారం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. సభా అధ్యక్షుడిగా రాంబాబు, ముఖ్య అతిథిగా ప్రముఖ సాహితీవేత్త ఏనుగు నరసింహారెడ్డి విచ్చేసి 'అమ్మ చెక్కిన శిల్పం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏనుగు నరసింహారెడ్డి మాట్లాడుతూ జాలాది రత్న సుధీర్ రచించిన అమ్మ చెక్కిన శిల్పం పుస్తకం చాలా అద్భుతంగా ఉందని, భవిష్యత్‌లో మరిన్ని పుస్తకాలు రాయాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రూప్ కుమార్ డబ్బీకార్, డా.సురభి శారద, గోవింద్ అక్షయ్, దీపక్ చిండాలియా తదితరులు పాల్గొన్నారు.

నాగదేవత ఆలయం.. స్వాతంత్ర్య యోధులకు నిలయం..

వికారాబాద్‌లో విశిష్ట ఆలయం
మహాత్మాగాంధీ, అబ్దుల్‌కలాం, అంబేద్కర్ తదితర మహనీయుల విగ్రహాల ఏర్పాటు
నిత్యం పూజలు చేస్తున్న జనం

వికారాబాద్, మే 14 : గ్రామాలు, పట్టణాల్లోని ఏ వీధిలో చూసినా ఆలయాలు, మసీదులు, చర్చిలు కనిపిస్తుంటాయి. వీటిలో కేవలం ఆయా మతాలకు సంబంధించిన పూజలు, ప్రార్థనలు మాత్రమే చేస్తారు. కానీ వికారాబాద్‌లోని నాగదేవత (అంబేద్కర్) ఆలయంలో ఏ మతాలకు చెందిన విగ్రహాలు లేకపోయినా ఇక్కడ నిత్యపూజలు కొనసాగుతున్నాయి. దేశానికి స్వాతంత్ర్యం సాధించిపెట్టిన మహానుభావులు, సమాజసేవకు తమ జీవితాలను అంకితం చేసిన మహనీయుల విగ్రహాలు, చిత్రపటాలకు ఇక్కడ నిత్యం పూజలు చేస్తారు. ఈ ఆలయంలో శివలింగం ఉన్నప్పటికీ.. లింగం పైభాగం సూర్యుడు అని..''కింది భాగం భూమి అని భక్తులకు అర్థమయ్యేలా రాసిపెట్టారు. ప్రకృతే ప్రధాన దైవమని చెప్పడమే ఇందులోని పరమార్థమని ఆలయ నిర్వాహకులు చెబుతున్నారు. అన్ని గ్రంథాలతో పాటు దేశ మానవాళికి దిక్సూచీగా నిలుస్తున్న రాజ్యాంగం మనకెంతో పవిత్రమైనదని వివరిస్తున్నారు. దేశనాయకుల విగ్రహాలు, ప్రకృతి పాఠాలతో వెలసిన ఆలయం భక్తులను ఆకట్టుకుంటున్నది.

అందరి సహకారంతో...

మున్సిపల్ పరిధిలోని ఓల్డ్ ఎల్ఐజీ కాలనీ 2012లో నాగదేవత ఆలయాన్ని నిర్మించారు. దీన్ని బీఆర్ అంబేద్కర్ దేవాలయం అనికూడా పిలుస్తారు. అంతకుముందు ఈ స్థలంలో ఓ పుట్ట ఉండటంతో నాగుల చవితి రోజున భక్తులు పెద్ద సంఖ్యలో ఇక్కడకు వచ్చి పూజలు నిర్వహించేవారు. 1995 నుంచి 2000 వరకు ఇదే వార్డుకు కౌన్సిలర్‌గా పనిచేసిన బండి రమేశ్ పుట్ట స్థలంలో నాగదేవత ఆలయాన్ని నిర్మించారు. 2012లో పలువురు పీఠాధిపతులు ఇక్కడ విగ్రహాలను ప్రతిష్ఠించారు. సర్వ మతాలకు చెందిన పెద్దలందరినీ ఈ ఆలయ నిర్మాణంలో భాగస్వామ్యం చేశారు. మానవాళిని కాపాడుతున్న ప్రకృతే దైవమని ఆలయ గోడలపై సూక్తులు రాశారు. ప్రధానంగా సూర్యుడు, భూమి, నీరు ఈ మూడింటి గురించి ఇక్కడ వివరిస్తుంటారు. వీటితో పాటు దేశ ఔనత్యాన్ని చాటిచెబుతూ..హక్కులు, విధులను సూచించిన భారత రాజ్యాంగమే పవిత్ర గ్రంథమని గోడలపై స్లోగన్స్ రాశారు. ఏ మత గ్రంథం గురించి తెలుసుకోకపోయినా పరవాలేదు.. రాజ్యాంగాన్ని అందరూ చదవాలని భక్తులకు చెబుతున్నారు. దేశభక్తుల విగ్రహాలు ఆలయంలో కులమతాలకు అతీతంగా మహనీయుల విగ్రహాలు ప్రతిష్ఠించారు. భరత మాత, మహాత్మాగాంధీ, బీఆర్ అంబేద్కర్, స్వామి వివేకానంద, మదర్ థెరిసా, సేవాలాల్ మహారాజ్, బసవేశ్వరుడు, పోతులూరి వీరబ్రహ్మం, విశ్వామిత్రుడు, అబ్దుల్ కలామ్ వంటిమహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేశారు.

ఆలయంలో స్వాతంత్ర్య సమరయోధులు, మత గురువుల విగ్రహాలు

అంబేద్కర్ ఆలయం ప్రాంగణంలో పూజలు చేస్తున్న భక్తులు

నాగదేవత

ఆలయంలో అంబేద్కర్ విగ్రహం

ఆలయంలో దేవుళ్ల విగ్రహాలు

దైవ మార్గంలో నడవాలి

మానవ మనుగడకు ప్రకృతే ప్రధాన ఆధారం భూమి, నీరు కలుషితం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉంది. భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన ప్రకృతిని అందించాలి. ఒక్కో మతంలో ఒక్కో వ్యక్తి దేవుడిగా పూజింపబడుతున్నాడు. వారి గొప్పతనం తెలుసుకొని వారు చూపిన మార్గంలో నడవాలన్నదే ఈ ఆలయ ప్రధాన ఉద్దేశం. జ్యోతిరావుపూలే, సావిత్రీబాయిపూలే తదితర విగ్రహాలు త్వరలో ఏర్పాటు చేస్తాం.

- బరాడి రమేశ్, ఆలయ నిర్వాహకుడు, వికారాబాద్

ముగిసిన పోలింగ్.. నెలకొన్న ఉత్కంఠ

బొంరాస్‌పేట, మే 14 : లోక్‌సభ ఎన్నికల పోలింగ్ సోమవారం ముగియడంతో ఫలితాలపై ఉత్కంఠ నెలకొన్నది. మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానం పరిధిలోకి వచ్చే కొడంగల్ నియోజకవర్గంలో 70 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ సరళిని పరిశీలించిన రాజకీయ పార్టీల నాయకులు తమ పార్టీకే మెజార్టీ వస్తుందని ధీమాగా ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన అనేక హామీలను అమలు చేయకపోవడంతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని ఆ వ్యతిరేకత ఓట్ల రూపంలో తమకు అనుకూలంగా మారిందని బీఆర్ఎస్ పార్టీ నాయకులు అంచనా వేస్తున్నారు. మరోవైపు అధికార కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల అమలులో భాగంగా కొడంగల్ నియోజకవర్గంలో ఉచిత బస్సు ప్రయాణం హామీ ఒకటే అమలవుతుంది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా గృహజ్యోతి, రూ.500లకే సిలిండర్ పంపిణీ పథకాలు ఇక్కడ అమలు కాలేదు. ఇది కూడా కొంత ప్రభావం చూపే అవకాశం ఉందని పలువురు భావిస్తున్నారు. అధికార కాంగ్రెస్ మాత్రం కొడంగల్‌లో తమకు 50 వేల మెజార్టీ తప్పక వస్తుందని అంచనాలు వేసుకుంటున్నారు. యువతతో పాటు ప్రజలు కూడా బీజేపీ వైపు ఆకర్షితులయ్యారని కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల కంటే తమకు మెజార్టీ వస్తుందని లెక్కలు వేసుకుంటున్నారు. ఏది ఏమైనా జూన్ 4న వచ్చే ఫలితాల వరకు ప్రజల్లో ఉత్కంఠ తప్పదు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

పెద్దేముల్, మే 14 : ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురై ఉరివేసుకొని ఓ యువకుడి ఆత్మహత్య చేసుకొన్న ఘటన పెద్దేముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. మంగళవారం ఎస్ఐ కె.గిరి తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఎండ్రికాయల సాయప్ప, చంద్రమ్మలకు ముగ్గురు కుమారులు, సాయప్పకు పెద్దల ద్వారా వచ్చిన ఆస్తి 3 ఎకరాల 12 గుంటల వ్యవసాయ భూమి ఉంది. ఇదిలా ఉండగా సాయప్ప ముగ్గురు కుమారులు గోవింద్, నారాయణ, జగన్ ఇండ్ల నిర్మాణం చేయాలని నిర్ణయం తీసుకొని పనులు ప్రారంభించి ప్రస్తుతం మూడు ఇండ్లకు వేర్వేరుగా పనులు కూడా ప్రారంభించారు. ఎండ్రికాయల జగన్ (30)కు ఆర్థిక ఇబ్బందులు ఉండి తదుపరి ఇంటి నిర్మాణానికి డబ్బులు లేకపోవడం ఇంటి నిర్మాణ విషయమై అన్నతో మాట్లాడి వస్తానని భార్య మౌనికతో చెప్పిన జగన్, అన్న గోవింద్ ఇంటికి సోమవారం రాత్రి 8:00 గంటల ప్రాంతంలో వచ్చాడు. వచ్చినాకు ఇంటి నిర్మాణానికి డబ్బులు లేవు ఉన్న భూమిని అమ్మి ఇల్లు కట్టుకుంటానని అందుకు భూమిని అమ్ముదామని చర్చించాడు. అందుకు అన్న గోవింద్ భూమి అమ్మ చంద్రమ్మ పేరు పైనా ఉంది ఎలక్షన్స్ అయిపోయాక పెద్దల నిర్ణయం తీసుకొని ఆలోచించి అమ్ముదామని గోవింద్ తమ్ముడు జగన్‌కు సముదాయించి నచ్చజెప్పాడు. ఆ తరువాత అక్కడ నుండి వెళ్లిపోయిన జగన్ ఎంత సేపటికీ ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిచోట వెతికారు. మంగళవారం ఉదయం పొలానికి వెళుతున్న స్థానికుడికి జగన్ ఓ చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్న విషయాన్ని గమనించాడు. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా, కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకొని బోరున విలపించారు. జగన్‌కు ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఘటనా స్థలానికి చేరుకొన్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాండూరులోని జిల్లా దవాఖానకు తరలించారు. భార్య మౌనిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ కె.గిరి తెలిపారు.

జగన్ (ఫైల్)

ఎన్‌హెచ్‌ఎంలో సుదీర్ఘ కాల ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

రామ రాజేశ్‌ఖన్నా, ఎన్‌హెచ్‌ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

సుల్తాన్‌బజార్, మే 14: జాతీయ ఆరోగ్య మిషన్ పథకంలో గత 24 ఏండ్లుగా విధులు నిర్వహిస్తున్న సుమారు 17 వేల 541 మంది కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులని క్రమబద్ధీకరించాలని ఏఐటీయూసీ ట్రేడ్ యూనియన్, ఎన్‌హెచ్‌ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా మం గళవారం ప్రభుత్వాన్ని కోరారు. పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ ఎన్‌హెచ్‌ఎం పథకం కింద సేవలు వినియోగించుకుంటున్న ప్రభుత్వం క్రమబద్ధీకరించేందుకు మాత్రం ముందుకు రావకపోవడం దారుణమన్నారు. దీంతో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇదిలా ఉండగా, కోఠి కమిషనర్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు మార్చి, ఏప్రిల్ నెలల వేతనాలు ఇంకా రాలేదని తక్షణమే విడుదల చేయాలని అన్నారు. జాతీయ ఆరోగ్య మిషన్ పథకంలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తున్న వారి సర్వీసును వెంటనే ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసి అన్ని క్యాడర్‌లకు 510 జీవో వర్తింపజేసి న్యాయం చేయాలన్నారు. ప్రతి నెల 5వ తేదీ లోపలే వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు నాలుగు వేల మందికి 510 జీవో అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమాన పనికి సమాన వేతనం కింద రెగ్యులర్ ఉద్యోగుల తరహాలో వేతనాలు చెల్లించాలన్నారు. మహిళా ఉద్యోగులకు 180 రోజులతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలని అన్నారు.



రామ రాజేష్ ఖన్నా

నర్సరీల్లో కూరగాయల నారు

కందుకూరు, మే 14 : కందుకూరు మండలం వాణిజ్య పంటలతో పాటు కూరగాయాల సాగుకు ప్రసిద్ధి. వానకాలంలో రైతులు సాధారణంగా పత్తి, కంది, మొక్క జొన్నల పంటల తర్వాత కూరగాయాల సాగుకు ప్రాధాన్యతను ఇస్తారు. కాగా మరి కొంత మంది రైతులైతే కేవలం కూరగాయాల పంటలనే సాగు చేస్తారు. టమటా, బెండ, వంగ, మిర్చి, క్యాబేజి, వంటి తదితర కూరగాయాల పంటలను పండించడంలో మండలం ప్రసిద్ధి గాంచింది. గతంలో కూరగాయాలు పండించడానికి ముందు భూమిని సిద్ధం చేశాక నాణ్యమైన కూరగాయాల విత్తనాలను కొనుగోలు చేసి వారి వారి చేలల్లోనే నారు వేసి మొలత్తాక తగిన సమయం చూసి విత్తుకునే వారు. ప్రస్తుతం దాదాపు రైతులు ఈ పద్ధతికి స్వస్తి పలుకుతున్నారు. కారణం కొత్తగా కూరగాయాల నారు అందించే నర్సరీలు వెలిశాయి. దీంతో రైతులు తమ అవసరాలు తీర్చుకుంటున్నారు. కాగా నగరానికి నియోజకవర్గం కూత వేటు దూరంలో ఉండటంతో చాలా మంది రైతులు కూరగాయాలను పండించి హైదరాబాదు మార్కెట్లకు తరలిస్తుంటారు. దీంతో కూరగాయాల సాగుకు చాలా మంది రైతులు మొగ్గ చూపడంతో కొందరు మండల కేంద్రంలో నర్సరీలను ఏర్పాటు చేసుకొని కూరగాయాల నార్లను రైతులకు అందుబాటులో ఉంచుతున్నారు.

నర్సరీల్లో మిరప, టమటా, క్యాబేజీ, కాలీ ఫ్లవర్, వంకాయ, తదితర కూరగాయాలతో పాటు రైతుల కోరిక మేరకు పూల మొక్కల నారును సైతం ఆర్డర్లపై అందిస్తున్నారు. ఏడాది పొడువునా రైతులకు కావాల్సిన నారును అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

అందుబాటు ధరలకు విక్రయం

రైతులకు కావాల్సిన పలు రకాల కూరగాయాల నారు నర్సరీల్లో సిద్ధంగా ఉంది. కొందరు రైతులు విత్తనాలు పెంచి తీసుకువెళతారు. ఇంకొంత మంది రైతులు నేరుగా కొనుగోలు చేసి తీసుకెళ్తారు. ఒక్కో మొక్క రైతులకు అనుకూల మైన రేట్లకు విక్రయిస్తాం. పూల మొక్కల ధరలు కూరగాయాల మొక్కల ధరలు వేర్వేరుగా ఉంటాయి. తమకు ఉపాధితో పాటు రైతులకు అనుకూలంగా ఉంటుంది.

గణేశ్, నర్సరీ నిర్వాహకుడు కందుకూరు



భగీరథ చిత్ర పటానికి నివాళులర్పించిన ఎంపీ ఆర్.కృష్ణయ్య

సగర కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య

ముషీరాబాద్, మే 14: సగర ఫెడరేషన్‌ను కార్పొరేషన్‌గా మార్చి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో సగర ఉప్పర హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీరడి భూపేష్ సాగర్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన భగీరథ జయంత్యుత్సవాల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. సగరులను బీసీడీ నుంచి గ్రూప్-ఏ లోకి మార్చాలని, ప్రతి సగర కుటుంబానికి 20 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సగర కార్పొరేషన్‌కు 500 కోట్ల బడ్జెట్ కేటాయించాలని, చట్ట సభల్లో తగిన ప్రాధాన్యత కల్పించాలని కోరారు. రాష్ట్రంలో దాదాపు ఎనిమిది లక్షలకు పైగా ఉన్న సగరులకు విద్యా, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం నేతలు గుజ్జ కృష్ణ, విజయేంద్ర సాగర్, హనుమంతు సాగర్, పార్థసారథి, జనార్దన్, నందగోపాల్, అనంతయ్య, జయంతి, ఉదయ్, నిఖిల్, హేమంత్ పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో మెరిసిన ఏఎంఎస్ విద్యార్థిని

ముగిసిన ఆసియా స్థాయి పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్

ఇ.శృతి

ఉస్మానియా యూనివర్సిటీ, మే 14: ఇటీవల ముగిసిన ఆసియా స్థాయి పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో ఆంధ్ర మహిళా సభ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విద్యార్థిని సత్తా చాటింది. బీ కామ్ రెండో సంవత్సరం చదువుతున్న ఇ.శృతి ఆ పోటీల్లో మన దేశానికి ప్రాతినిధ్యం వహించి, మొత్తం ఎనిమిది పతకాలు కొల్లగొట్టింది. వాటిలో ఏషియన్ యూనివర్సిటీస్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో నాలుగు బంగారు పతకాలు, ఏషియన్ పవర్ లిఫ్టింగ్ ఓపెన్ చాంపియన్‌షిప్‌లో నాలుగు కాంస్య పతకాలు ఉండటం విశేషం. ఈ పోటీలు ఈ నెల 5వ తేదీ నుంచి 11వ తేదీ వరకు హాంగ్‌కాంగ్‌లో జరిగాయి. ఈ సందర్భంగా ఆమెను కళాశాల చైర్మన్, మాజీ ఐఏఎస్ అధికారి డి.చక్రపాణి, సెక్రెటరీ డాక్టర్ ఎన్.రజని, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ఝాన్సీరాణి, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.కరుణాదేవి, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ ఏ.ప్రమీల, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీదేవి అభినందించారు. అంతర్జాతీయ స్థాయిలో కళాశాల కీర్తి ప్రతిష్టలు చాటిడం తామందరికీ గర్వకారణంగా ఉందని ప్రశంసించారు.

తప్పుడు సమాచారమిచ్చిన..

కానిస్టేబుల్, హోంగార్డ్ సస్పెన్షన్

కీసర, మే 14: నగదు పట్టివేతలో పోలీసు ఉన్నతాధికారులకు తప్పుడు సమాచారమిచ్చిన ఇద్దరు పోలీసులపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ ఘటన కీసర పోలీసుస్టేషన్ పరిధలో చోటు చేసుకుంది. పోలీసు అధికారుల కథనం ప్రకారం.. కీసర మండలం కరీంగూడ చౌరస్తా వద్ద శనివారం సాయంత్రం మొబైల్ టీం కానిస్టేబుల్ శ్రీకాంత్ యాదవ్, హోంగార్డు రాజు గస్తీ తిరుగుతూ.. వాహనాల తనిఖీ చేపట్టారు. ఔటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్డు పక్కన ఉన్న మార్గం గుండా పల్సర్ బైక్‌పై వెళ్తున్న సాయికుమార్, కార్తీక్‌ను పట్టుకున్నారు. ఆ ఇద్దరు యువకులను తనిఖీ చేయగా.. వారి వద్ద రూ.25 లక్షల నగదు దొరికింది. పెద్ద మొత్తంలో నగదు చూడగానే పోలీసులకు ఒక్కసారిగా దుర్బుద్ధి పుట్టింది. వారిని చాలా సేపు తమ వెంట తిప్పించుకొని, సతాయించి వారి వద్ద ఉన్న నగదును స్వాధీనం చేసుకున్నారు. ఆ డబ్బులో నుంచి సుమారు రూ.6.7 లక్షలు తెలివిగా కానిస్టేబుల్, హోంగార్డు కాజేసి, మిగతా రూ.18.30 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసు ఉన్నతాధికారులకు సమాచారమిచ్చారు. ఆ డబ్బుకు సంబంధించి పూర్తి ఆధారాలు ఉండటంతో ఈ విషయాన్ని సాయికుమార్, కార్తీక్ కలిసి కీసర ఇన్‌స్పెక్టర్ వెంకటయ్యకు వివరించారు. ఇన్‌స్పెక్టర్ వెంటనే ఈ విషమంపై ఉన్నతాధికారులకు పూర్తి సమాచారం అందించారు. ఈ విషయమై డీసీపీ పద్మ, ఏసీపీ మహేశ్ విచారణ చేపట్టి, కానిస్టేబుల్ శ్రీకాంత్‌యాదవ్, హోంగార్డు రాజును సస్పెండ్ చేశారు.

లాఠీచార్జికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలి

బొంరాస్‌పేట, మే 14 : ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు నిబంధనల ప్రకారం టీఏ, డీఏ చెల్లించాలన్నందుకు, రెమ్యునరేషన్ చెల్లింపులో తేడాలు ఎందుకని ప్రశ్నించిన వారిపై లాఠీచార్జి చేసిన పోలీసులు, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడు గౌరారం గోపాల్, ప్రధాన కార్యదర్శి నరేందర్‌గౌడ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సోమవారం నారాయణఖేడ్‌లో ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన టీఏ, డీఏలను నిబంధనల ప్రకారం చెల్లించాలని ప్రశ్నించిన యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి మరియు ఇతర ఉద్యోగులపై ఆర్డీవో ఆదేశాల మేరకు పోలీసులు లాఠీచార్జి చేశారని వారు ఆరోపించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

చైన్ స్నాచర్ దొరికాడు

ఖైరతాబాద్, మే 14 :ప్రహరీ దూకి ఇంట్లోకి చొరబడి.. వృద్ధురాలి మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కెళ్లిన దొంగను పంజాగుట్ట పోలీసులు పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం... ఈ నెల 12న శాలివాహన నగర్‌లో ఉన్న విజయలక్ష్మి ఇంటి ప్రహరీ దూకి, ఇంటిలోకి చొరబడిన దుండగుడు ఆమె మెడలో ఉన్న నాలుగు తులాల బంగారు పుస్తల తాడును తెంచుకొని వెళ్లాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. మంగళవారం నిందితుడిని వెస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకొని, పంజాగుట్ట పీఎస్‌లో అప్పగించారు. నిందితుడిని గుంటూరు జిల్లాకు చెందిన కొండేటి నాగ పృథ్వీ (23)గా గుర్తించారు. ప్రస్తుతం ఎల్లారెడ్డిగూడలో ఉంటూ, చదువుకుంటున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. నిందితుడి వద్ద నుంచి బంగారు గొలుసును స్వాధీనం చేసుకోవడంతో పాటు అతడి సెల్‌ఫోన్‌ను కూడా సీజ్ చేశారు.

ఓటు వేయడాన్ని చిత్రీకరించిన వ్యక్తిపై కేసు

బంజారాహిల్స్, మే 14: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్ తీసుకువెళ్లడంతో పాటు ఓటు వేసేటప్పుడు వీడియో తీసిన వ్యక్తిపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. సోమవారం లోక్‌సభ ఎన్నికల పోలింగ్ సందర్భంగా బంజారాహిల్స్ రోడ్ నం. 12లోని ఎన్‌బీటీ నగర్‌లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో నవీన్ (42) ఓటు వేయడానికి వచ్చాడు. తనతో పాటు రహస్యంగా తెచ్చుకున్న సెల్‌ఫోన్‌తో తాను ఓటేస్తున్న దృశ్యాన్ని చిత్రీకరించాడు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ వీడియో తీసిన ఓటర్ నవీన్‌పై చర్యలు తీసుకోవాలని సెక్టోరియల్ ఆఫీసర్ బి.కళ్యాణి ఇచ్చిన ఫిర్యాదుతో బంజారాహిల్స్ పోలీసులు ఐపీసీ 188తో పాటు ప్రజాప్రాతినిధ్య చట్టంలోని 132 సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

Before the Hon'ble Arbitrator /
Dy. Registrar of Chits at Mahabubnagar
ARB. Claim No.153 of 2024
Between
SHRIRAM RAGHAVENDRA CHITS
Br.Mahabubnagar. ... Disputant
And
V. Rajitha and others ...Opponents
To
NOTICE
3) B. Ravinder S/o B. Chakrapani, aged 41 years, Occ: Secondary Grade Teacher (Emp. No.1468016), O/o Upper Primary School at Mallepally (V), Doma (M), Vikarabad (D), R/o H.No.3-78, Verna Chec (V), Ranga Reddy (D);
4) D. Ravi Kumar S/o D. Venkataiah, aged 38 years, Occ: Secondary Grade Teacher (Emp. No.1467968) O/o Upper Primary School at Mallepally (V), Doma (M), Vikarabad (D), R/o H.No.2-45, Doma (V&M), Vikarabad Dist.
Opponents
Claim for Recovery of Rs.7,98,792/- (Rupees, Seven Lakhs Ninety Eight Thousad Seven Hundred Ninty two Only)
Take notice that the above Arbitration case filed by the Disputant to recover the chits clues under A.P. Chit Fund Act. and Rules of 2008 against you and others. You are avoiding the notice, hence we are publishing notice on you to appear before the Arbitrator H.No.7-5-103/2/A, back side of Telephone Exchange, Venkateshwara Colony, Mahabubnagar on 25-05-2024 at 11-30A.M. for your appearance, in person or through an Advocate, in case you failed to appear before this Hon'ble Arbitrator the Claim will be decided ex-parte.
"By the order of the Arbitrator"
Mahabubnagar
S. MALLA REDDY Advocate
H.No.8-6-212, Padmavathi Colony
Mahabubnagar . Cell No.9000002415

ఆర్థిక సాయం

కులకచర్ల, మే 14 : మండల పరిధిలోని బండవెల్కిచర్ల గ్రామానికి చెందిన కుమ్మరి కిష్టయ్య మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ప్రజానాయకుడు కుమ్మరి స్వామి అక్కడికి చేరుకొని బాధిత కుటుంబాన్ని పరామర్శించి అంత్యక్రియల కోసం రూ.10వేలు ఆర్థిక సాయం మృతుడి కుమారుడు కృష్ణయ్యకు అందించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
RECRUITMENT
★Pen, Pencil Company, Educated, Unemployed Girls/Boys, Male/Female, House Wife Earn 24500-64500 Packing Work at Home 9034548725, 9728230253
NT-3277-All
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభ